క్లుప్తంగా

గ్రూప్‌-1కు పకడ్బందీ ఏర్పాట్లు

- పరీక్ష కేంద్రాల వద్ద 144సెక్షన్ విధింపు
- డీఎస్పీ బాలకృష్ణా రెడ్డి



తాండూరు టౌన్: నేడు జరగనున్న గ్రూప్‌–1 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని తాండూరు డీఎస్పీ బాలకృష్ణా రెడ్డి శనివారం తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 360 మంది, సింధు డిగ్రీ కళాశాలలో 528 మంది, సింధు బాలికల జూనియర్ కళాశాలలో 288 మంది, సిద్దార్థ జూనియర్ కళాశాలలో 312 మంది అభ్యర్థులతో కలిసి మొత్తం 1,488 మంది పరీక్ష రాయనున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసు బందోబస్తుతో పాటు 144 సెక్షన్ విధించామని చెప్పారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరగనుందన్నారు. ఈ సమయంలో పట్టణంలోని జిరాక్స్ సెంటర్లను మూసేయాలని ఆదేశించారు. ఉదయం 10 గంటలు దాటిన తర్వాత పరీక్షా కేంద్రంలోకి అనుమతించమని డీఎస్పీ స్పష్టం చేశారు.

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ పత్రం అందజేస్తున్న తిరుపతిరెడ్డి

బొంరాస్‌పేట: నిరుపేదలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి ఉందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధి బాపల్లికి చెందిన హరిశ్చందర్ నాయక్‌కు రూ.1.30లక్షల ఎల్‌ఓసీ పత్రాన్ని ఆయన అందజేశారు. అనంతరం తిరుపతిరెడ్డి మాట్లాడారు. అత్యవసర ఆర్థిక సాయాన్ని అందించి, ఆదుకునేందుకు సీఎం వెనుకాడరని తెలిపారు.

భగీరథ నీటి సరఫరా సర్వే



వివరాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

దౌల్తాబాద్: మిషన్ భగీరథ నీటి సరఫరా గురించి గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఇంటింటి సర్వే చేపట్టారు. ఇంటింటికి తిరుగుతూ.. కుటుంబ సభ్యుల వివరాలు, ఇంటి యజమాని ఫొటోతో పాటు భగీరథ నీరు సక్రమంగా సరఫరా అవుతుందా లేదా అనే వివరాలను సేకరిస్తూ.. భగీరథ యాప్‌లో పొందుపరుస్తున్నారు. ఈ సందర్భంగా చంద్రకల్ గ్రామంలో కొనసాగుతున్న సర్వేను ఎంపీడీఓ విజయలక్ష్మి పరిశీలించారు.

ఎన్నాళ్లీ కంకర రోడ్డు కష్టాలు



కుదుగుంట రావులపల్లి పంచాయతీ రాజ్ రోడ్డు దుస్థితి

మర్పల్లి: మండల పరిధి కుదుగంట మీదుగా రావులపల్లి వరకు వెళ్లే 4 కిలో మీటర్ల పంచాయతీ రాజ్ రోడ్డు పూర్తిగా కంకర తేలి అధ్వానంగా మారింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ప్రమాదాల బారిన పడి, ఆస్పత్రుల పాలవుతున్నారు. వాహనాలు కాదు కదా.. కనీసం ఈ రోడ్డుపై కాలి నడకన వెళ్లలేని దుస్థితి నెలకొందని స్థానికులు వాపోయారు. ఎన్నాళ్లీ కంకరోడ్డు కష్టాలు అని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని పలువురు కోరారు.

రైతులను ఆదుకుంటాం

షాబాద్: ఆపదలో ఉన్న రైతు కుటుంబాన్ని ఆదుకునేందుకు కురుమ సంఘం ద్వారా ఆర్థికసాయం అందజేసినట్లు కురుమ సంఘం మండల అధ్యక్షుడు మద్దూరి పాండు పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని మన్‌మర్రి గ్రామంలో శుక్రవారం రెండు పాడి ఆవులు విద్యుత్ షాక్‌తో మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న కురుమ సంఘం సభ్యులు బాధిత రైతు పొట్టిగారి నర్సింహులుకు రూ.60వేల ఆర్థికసాయం అందజేశారు. వర్షాకాలంలో రైతులు తమ పశువులను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు చందిప్ప జంగయ్య, బోకుల లింగం, కురుమ సంఘం మండల ఉపాధ్యక్షుడు కారు చెన్నయ్య, మన్‌మర్రి మాజీ ఉపసర్పంచ్ గోపాల్, సంఘం సభ్యులు బండ కృష్ణ, నారాయణ, నరేందర్, శ్రీకాంత్, నాగేశ్, కుమార్ తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కేశంపేట: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలతో పాటు అర్హులైన వారికి ప్రమోషన్లను కల్పించేందుకు ఇచ్చిన ఉత్తర్వుల్లో రంగారెడ్డి జిల్లా లేకపోవడంతో ఇక్కడి ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) మండల ప్రధాన కార్యదర్శి రవి కుమార్ అన్నారు.

పేరుగొప్ప.. ఊరుదిబ్బ

- నిధులు లేవు, గుర్తింపు లేదు
- అభివృద్ధి చేయలేకపోతున్నాం..
- ప్రజల మధ్య ఉండలేకపోతున్నాం
- ఎంపీటీసీల ఆవేదన





గెలిచిన సంబురంలో ఎంపీటీసీలు(ఫైల్) (ఇన్‌సెట్లో) మండల పరిషత్ కార్యాలయం

బొంరాస్‌పేట: 'పేరుకే ప్రజాప్రతినిధులం. నిధులు లేవు. సమాజంలో గుర్తింపు లేదు. పేరుగొప్ప బతుకులు మావి' అని ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మండల పరిధిలో 15మంది మండల ప్రాదేశిక కమిటీ సభ్యులు(ఎంపీటీసీ) ఉండగా.. వీరిలో 13మంది బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన వారు కాగా.. ఇద్దరు(చిల్మల్‌మైలారం, కొత్తూరు) కాంగ్రెస్‌కు చెందిన వారు. మొత్తం 47 గ్రామపంచాయతీలకు సర్పంచుల నిధులు సరిపోకపోవడం, ఎంపీటీసీల నిధులు లేకపోవడం వలన మండల అభివద్ధి కుంటుపుతోందని ఎంపీటీసీలు పేర్కొంటున్నారు. పదవీకాలం ముగియడానికి వస్తున్నా.. ఎక్కడ వేసిన గొంగళి అక్కడేనన్న చందంగా తమ జీవితాలు మారాయని, ఇంతకు తాము ఎందుకున్నామో తెలియడం లేదని విచారం వ్యక్తంచేస్తున్నారు.

కంటి తుడుపు నిధులే!

2019 మే6న ఎంపీటీసీల ఎన్నికలు జరిగాయి. పదవుల్లోకి వచ్చిన నాటి నుంచి.. ప్రాదేశిక సభ్యులకు ఎలాంటి అభివద్ధి నిధుల కేటాయింపు జరగలేదు. ఇదివరకు రెండు నెలల్లో జిల్లా నుంచి మండలానికి రూ.18లక్షలు మాత్రమే మంజూరయ్యాయి. గ్రామాల్లో తాగునీటి సరఫరా, మురికి కాల్వల పనుల కోసం ఖర్చుచేయాలని ఉంది. కానీ.. ఆ నిధులను ఎంపీటీసీల వారీగా కేటాయింపులు జరగగా.. ఒక్కొక్కరికి రూ.1లక్ష నుంచి రూ1.50లక్షలు మాత్రమే వచ్చాయి. ఈ అరకొర నిధులతో ఏం చేయగలం అని ఆవేదన వ్యక్తంచేశారు. నిధుల ఖర్చు విషయంలో సర్పంచులతో కలిసి ఖర్చుపెట్టాలనే తిరకాసు ఉంటుందనే విధానానికి మరింత దూరమై నిధుల జోలికి వెళ్లలేకపోయామని వెల్లడించారు.

'గుడ్‌విల్'లతో ఆమ్దాని?

మూడంచెల వ్యవస్థలో భాగంగా ఎన్నికల బరిలో దిగుతున్న ఎంపీటీసీ అభ్యర్థులు గెలుపుకోసం ఆరాటపడుతున్నారు. తమకున్న వ్యక్తిగత పరపతిని, పార్టీ గుర్తింపును దృష్టిలో ఉంచుకొని బరిలో దిగి విజయం సాధిస్తున్నారు. ఆ తర్వాత నిధుల మంజూరు లేకున్నా.. ఇతర ఎన్నికల్లో వీరి ఓటు బలం అవసరం కావడంతో గుడ్‌విల్‌లు మాత్రం పెద్ద ఎత్తున అందుతున్నట్లు సమాచారం. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ ఎన్నికల్లో పదవిలో ఉన్న ఎంపీటీసీలకు భారీగా ముడుపులు అందుతున్నాయని ప్రతిపక్ష నాయకులు ఆరోపించారు. సర్పంచులు పెట్టుబడి పెట్టి, పనులు చేయించి నిధుల మంజూరు కాక ఇబ్బందులు పాలయ్యారు. చివరకు పదవి కాలం ముగిసినప్పటికీ.. అప్పుల పాలయ్యామని ఆవేదన చెందుతున్నారు. ఎంపీటీసీ సభ్యులకు అభివృద్ధి నిధుల సంగతి ఎలా ఉన్నా.. ఎక్కువ ముడుపులు పొంది లాభపడుతున్నారన్న విమర్శలు లేకపోలేదు.

తిరకాసు వద్దు



పేరుకే ఎంపీటీసీలం. గ్రామాల అభివద్ధిలో సర్పంచులకు అందుతున్న నిధులు సరిపోవు. సంపూర్ణంగా అభివద్ధి కావాలంటే ఎంపీటీసీలకు నిధులు ఇవ్వాలి. ఖర్చు చేసేందుకు స్వేచ్ఛ కల్పించాలి. సర్పంచులతో కలిసి ఖర్చుపెట్టాలనే తిరకాసును తీసివేయాలి. లేకపోతే పొంతన కొరవడి గ్రామాల అభివద్ధి కుంటుపడుతుంది.

– శ్రావణకుమార్‌గౌడ్, వైస్ ఎంపీపీ, బొంరాస్‌పేట

నిధులు కావాలి



జనాభా పెరుగుదల, కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటుతో ఎంపీటీసీలకు అధిక నిధులు కేటాయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గెలిచిన మొదటి ఏడాది ఎలాంటి నిధులు ఇవ్వలేదు. ప్రస్తుతం 'సమస్యలు బోలేడు, నిధులు చారెడు' అనే విధంగా కంటితుడుపుగా నిధులు వచ్చాయి. సరిపడా నిధులు కేటాయించి, సమాజంలో గుర్తింపునిస్తే బాగుంటుంది.

–తిరుపతయ్య, ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు, తుంకిమెట్ల

నిరుపయోగంగా రైతు బజార్

- రోడ్లపైనే కూరగాయల విక్రయాలు
- లక్షల రూపాయల ప్రజాధనం వృథా
- అవగాహన కల్పించని అధికారులు, ప్రజాప్రతినిధులు



రైతు బజారులో వృథాగా షెడ్లు

చేవెళ్ల: మండల కేంద్రంలో ప్రజలు, రైతులకు ఉపయోగపడుతుందని లక్షల రూపాయల ప్రజాధనం ఖర్చు చేసి రైతు బజార్ నిర్మించిన వ్యాపారులు రోడ్లపైనే కూరగాయలు విక్రయిస్తుండడంతో నిరుపయోగంగా మారింది. దీంతో రైతు బజార్ స్థలంలో పక్కనే ఉన్న కాలనీవాసులు చెత్త చెదారాలు వేస్తుండటంతో అది డంపింగ్‌యార్డుగా కనిపిస్తోంది. రోడ్లపై అమ్మకుండా పాలకవర్గం, అధికారులు చర్యలు తీసుకుంటేనే రైతుబజార్ వినియోగంలోకి వస్తుందని, ఇప్పటికైనా అధికారులు ఈ దిశగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. మండల కేంద్రంలో అన్ని హంగులతో నిర్మించిన రైతుబజార్‌ను వినియోగించుకోకపోవడంతో వెలవెలబోతోంది. నాలుగేళ్ల క్రితం ప్రారంభించిన ఈ రైతుబజార్ నాలుగునెలలు కూడా సక్రమంగా నడవలేదు. చేవెళ్లలో కూరగాయలు కావాలంటే ప్రధాన రోడ్ల వెంట ఉండే దుకాణాలు రైతు బజార్‌లుగా మారాయి. రైతు బజార్‌లో దాదాపు 40 మంది విక్రయదారులు కూరగాయలు విక్రయించుకునేందుకు వీలుగా షెడ్‌లు, రోడ్లు ఏర్పాటు చేశారు. రైతుబజార్ షెడ్‌లు బోసిపోయి నిరుపయోగంగా కనిపిస్తున్నాయి. కరోనా లాక్‌డౌన్ సమయంలో మాత్రం బయట దుకాణాలు బంద్‌చేసి కేవలం రైతు బజార్‌లోనే కూరగాయల విక్రయాలు చేయటంతో రైతు బజార్ కళకళలాడింది. ఆ తరువాత మళ్లీ యాథావిధిగా రోడ్లపై కూరగాయలు విక్రయిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి ఈ రైతు బజారును ఉపయోగించుకునేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పట్టించుకునే వారు లేక..

మండల కేంద్రంలో ప్రజల కోసం నిర్మించిన రైతు బజార్‌ను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు స్థానిక నాయకులు ఎవరూ ముందుకు రావటం లేదు. మార్కెట్ కమిటీ చైర్మన్‌లు, మార్కెట్ అధికారులు పట్టించుకోకపోవటంతో ఇలా ప్రజాధనంతో నిర్మించిన రైతుబజార్ వృథాగా మారుతోంది. స్థానిక నాయకుల అండదండలతోనే చిరువ్యాపారులు దర్జాగా రోడ్లపైనే అమ్మకాలు చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

ధాన్యం బస్తాలతో కళకళ

ధారూరు: వ్యవసాయ మార్కెట్‌కు శనివారం సన్న రకం వడ్లు (సోన) 608 ధాన్యం బస్తాలు వచ్చాయని మార్కెట్ కార్యదర్శి సిద్దమ్మ తెలిపారు. క్వింటాల్‌కు రూ.2,270 నుంచి రూ.2,380 వరకు ధర చెల్లించి, కొనుగోలు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. దొడ్డు రకం వడ్లు క్వింటాల్‌కు రూ.2,100 నుంచి రూ.2,120 వరకు ధర పలికిందని చెప్పారు. మొక్కజొన్న 176 బస్తాలు రాగా.. క్వింటాల్‌కు రూ.2,170 నుంచి రూ.2,340కి కొనుగోలు చేసినట్లు ఆమె వెల్లడించారు.

మృగశిర కార్తె వచ్చింది..

మీనం ధర మెరిసింది



మర్పల్లి: రావులపల్లి చెరువు వద్ద చేపలు విక్రయిస్తున్న మత్స్యకారులు

పరిగి/మర్పల్లి: మృగశిర కార్తె ప్రారంభం అయింది. ఈ కార్తె రోజున రైతులు వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టగా.. ఇదే రోజున ప్రతి ఇంట్లో చేపలు తినడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా చేపల కోసం ఫిష్‌మార్కెట్లకు జనం పరుగులు తీయగా.. కొందరు చెరువుల్లో చేపల వేట కొనసాగించారు. పలువురు వ్యాపారులు సైతం చెరువుల వద్దే చేపలను శుద్ధి చేసి, మాసం విక్రయించారు. సాధారణ రోజు కంటే కార్తె రోజున చేపలు తినేందుకు ప్రజలు ఆకస్తి చూపడంతో.. వ్యాపారులు ధరలు పెంచి అమ్మడం సహజం. శనివారం పరిగి మార్కెట్లో బొచ్చ, రవ్వ, తదితర చేపలు కిలోకు రూ.150 ధర పకలగా.. కోరమీను రూ.500కు విక్రయించారు.

ప్రత్యేకత..

దుద్యాల్: మృగశిర కార్తె అనగానే ప్రతి ఒక్కరికీ తొలుత గుర్తుకు వచ్చేవి చేపలు. అసలు ఈ రోజున చేపలు ఎందుకు తింటారనేది చాలా మందికి తెలియదు. సహజంగా చేపలు తినడం వలన ఆరోగ్యానికి మేలు చేస్తుందని ప్రజలు నమ్ముతారు. వైద్యులు కూడా చికెన్, మటన్ కంటే చేపలే ఎక్కువగా తినాలని సూచిస్తుంటారు. ఇదిలా ఉండగా.. మృగశిర కార్తెతో తొలకరి జల్లులు కురవడంతో అందరూ వేసవి తాపం నుంచి ఉపశమనం పొందుతారు. సూర్యుడు మృగశిర నక్షత్రంలో ప్రవేశించిన నాటి నుంచి నైరుతి పవనాలు వచ్చి వాతావరణం చల్లబడి, ప్రకృతిలో అనేక మార్పులు చోటు చేసుకుంటాయి. వానాకాలం ప్రారంభంలో చేపలు తినడం వలన మనిషి శరీరంలో రోగనిరోధక శక్తి పెరిగి, సీజనల్ వ్యాధుల నుంచి రక్షింపబడతామని అత్యధికుల విశ్వాసం. ఈ కారణంగానే కార్తె రోజున చేపలు తినడం పూర్వికుల నుంచి ఆనవాయితిగా వస్తుందని పెద్దలు పేర్కొనడం గమనార్హం.



పరిగి చేపల మార్కెట్లో..

ఒప్పించి.. రాజీ కుదిర్చి..

లోక్ అదాలత్‌లో 528 కేసుల పరిష్కారం



లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జడ్జి శిల్ప

పరిగి: రాజీయే రాజమార్గమని పరిగి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి నాగుల శిల్ప అన్నారు. శనివారం పరిగి న్యాయస్థానంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో కక్షిదారులను ఒప్పించి.. రాజీ కుదిర్చి 528 కేసులను పరిష్కరించారు. అనంతరం జడ్జి మాట్లాడారు. పంతాలకు పోయి గొడవలు పెంచుకోవద్దని సూచించారు. క్షణికావేశంలో చేసిన తప్పులు కేసులకు దారితీస్తాయని చెప్పారు. కావున ఎలాంటి కేసులైనా లోక్ అదాలత్‌లో ఇబ్బంది లేకుండా పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. ఇందులో పరిష్కరించిన కేసులను అంతిమంగా పరిగణిస్తారని వెల్లడించారు. కక్షిదారులు ఎవరైనా ఉంటే.. లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీపీ దీపారాణి, ఏజీపీ వెంకట్‌రెడ్డి, బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

జీతాలు లేవు.. జీవితం ఎలా గడవాలి



పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

కుల్కచర్ల: పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం తిర్మలాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడారు. 10 నెలలుగా జీతాలు లేక ఇబ్బంది పడుతున్నామని, పూట గడవని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. ఇన్ని నెలలుగా వేతనాలు ఇవ్వకపోతే.. మా జీవితాలు ఎలా గడవాలని ప్రశ్నించారు. నిత్యం పారిశుద్ధ్య పనులు చేపడుతూ.. ప్రజారోగ్యానికి పాటుపడుతున్న తమను.. అధికారులు చిన్నచూపు చూస్తున్నారని, ఆకలితో అలమటించేలా చేస్తున్నారని వాపోయారు. సంబంధిత అధికారులు స్పందించి తమకు వేతనాలను చెల్లించాలని కోరారు. సమ్మెకు మద్దతుగా నిలిచిన స్థానిక నాయకులు.. సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు నిరసనను విరమించారు.

బాల సాహిత్యంతో ఆకట్టుకోవాలి

- బాలల్లో మాతృభాషపై మక్కువ పెంపొందించాలి
- తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి



అనంత సంకలనం, ప్రకృతి పరిమళం కావ్యాన్ని ఆవిష్కరిస్తున్న కవులు

తాండూరు టౌన్: నేటి తరం పిల్లలకు తెలుగు భాషపై ఏమాత్రం పట్టులేదని తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి ఆందోళన వ్యక్తంచేశారు. మాతృ భాష, సాహిత్యం, కథలపై వారిలో మక్కువ పెంచేందుకు కవులు బాల సాహిత్యాన్ని అందజేయాలని సూచించారు. ఆదివారం స్థానిక ఫంక్షన్ హాల్‌లో బీపీ నర్సింలు అధ్యక్షతన అనంత సాహిత్య, సాంస్కృతిక వేదిక తొలి వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నామోజు మాట్లాడారు. జిల్లాకు చెందిన 81 మంది కవులు ఒకే వేదిక పంచుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం కవులు రచించిన పద్యాలు, గేయాలు, మణిపూసల వచన కవితలతో కూడిన 'అనంత' సంకలన గ్రంథం, ప్రముఖ కవి దోరవేటి రచించిన 'ప్రకృతి పరిమళం' అనే మణిపూసల కావ్యాన్ని ఆవిష్కరించారు. శతావధాని డాక్టర్ మలుగ అంజయ్య, రంగస్థల నటుడు మాలెల అంజిలయ్య గౌడ్‌కు జీవన సాఫల్య పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారుల చేసిన నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విశిష్ట అతిథులు డాక్టర్ బాగయ్య, మల్లారెడ్డి, చంద్ర ప్రకాష్ రెడ్డి, నర్సింగ్ రావు, తుల్జారాం సింగ్, పటేల్ శివకుమార్, రాఘవేంద్రాచార్యులు, సత్యం, ఆశీర్వాదం, కోటం చంద్రశేఖర్, మాణిక్ రావు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో మెరుగైన విద్య

- ఉచితంగా పుస్తకాలు, దుస్తులు, భోజనం
- మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపండి.. ప్రయోజకులుగా చూడండి
- బడిబాటలో ఉపాధ్యాయుల ప్రచారం



దుద్యాల్: పోలేపల్లిలో..



యాలాల: విశ్వనాథ్‌పూర్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

యాలాల: ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన లభిస్తుందని విశ్వనాథ్‌పూర్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు ఇందోలు శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా.. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ, సిబ్బందితో కలిసి గ్రామంలో ఇంటింటికీ తిరిగారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. అనంతరం ఆయన మాట్లాడారు. సర్కారు బడుల్లో నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్న భోజనం, రెండు జతల యూనిఫాంలు, ఉచితంగా పాఠ్య, రాతపుస్తకాలు అందజేయనున్నట్లు వెల్లడించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో సరస్వతి నిలయాల్లో మౌలిక వసతుల కల్పనతోపాటు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందని, బడిబయట పిల్లలతో పాటు ప్రైవేటు స్కూళ్లకు వెళ్లే విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడుల్లో చేరిప్పించాలని అభ్యర్థించారు. ఐదు సంవత్సరాలు పైబడిన వారిని బడిబాట పట్టించాలని సూచించారు. అంతకుముందు బడిబాట ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఏపీసీ చైర్మన్ గుర్రాల వనమాల, పంచాయతీ కార్యదర్శి వెంకటయ్య, బుక్ కీపర్ వెంకట్, ఉపాధ్యాయురాలు సంతోష తదితరులు ఉన్నారు.

ఇంటింటి సర్వే..

దుద్యాల్: బడిబాటలో ఉపాధ్యాయుల బిజీబిజీగా ఉన్నారు. మండల పరిధి పోలేపల్లి, లయ, చిల్ముల్ మైల్వార్ గ్రామాల ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు కిష్టయ్య, అంజిలయ్య రమేశ్, ఉదయ చంద్రికలు ఇంటింటికీ తిరుగుతున్నారు. బడి బయట పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని వారి తల్లిదండ్రులకు సూచిస్తున్నారు.

మల్కాపూర్‌లో..

తాండూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను బోధిస్తున్నామని, మీ పిల్లలను సర్కారు బడికి పంపించాలని మల్కాపూర్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం నాగప్ప గ్రామస్తులను కోరారు. బడిబాటలో భాగంగా గ్రామంలో ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటికి తిరిగారు. ఈ సందర్భంగా నాగప్ప మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం తగిన సౌకర్యాలు కల్పిస్తుందని తెలిపారు. ఉచితంగా పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫాంలతో పాటు నాణ్యమైన భోజనం వడ్డిస్తుందని వెల్లడించారు. కావున తల్లిదండ్రులు మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు.

యూనిఫాం అందజేత

పరిగి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తున్నామని కాంప్లెక్స్ హెచ్‌ఎం గోపాల్ అన్నారు. మండల పరిధి సయ్యాద్‌మల్కాపూర్ ప్రాథమిక పాఠశాలలో చేపట్టిన బడిబాటలో విద్యార్థులకు ఏపీఎం శ్రీనివాస్‌రెడ్డి ఏకరూప దుస్తులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రైవేటుకు దీటుగా సర్కారు బడులు కొనసాగుతున్నాయని తెలిపారు. విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియంలో బోధన చేస్తున్నామన్నారు.

బడీడు పిల్లలను..

దౌల్తాబాద్: బడీడు పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని బిచ్చాల పాఠశాల హెచ్‌ఎం కృష్ణయ్య అన్నారు. గ్రామంలో ఆయన.. తోటి ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారులతో కలిసి బడిబాట నిర్వహించారు. మీ పిల్లలను సర్కారు బడుల్లోనే చేర్పించాలని గ్రామస్తులను కోరారు.



విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న హెచ్‌ఎం, ఏపీఎం



దౌల్తాబాద్: బిచ్చాలలో..

సకాలంలో పూర్తి చేయాలి



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎంఈఓ చంద్రప్ప

బంట్వారం: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను విద్యాసంవత్సరం ప్రారంభంలోగా పూర్తి చేయాలని ఎంఈఓ చంద్రప్ప అన్నారు. కోట్‌పల్లి మండలం జిన్నారం ప్రాథమిక పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. రూ.4లక్షలతో.. గ్రామ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, పాఠశాల హెచ్‌ఎం పర్యవేక్షణలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడమే 'అమ్మ' లక్ష్యమని వెల్లడించారు. పనుల్లో జాప్యం చేయవద్దని సూచించారు. ఇందులో ఎంపీటీసీ బందెయ్య, సీఆర్పీ నర్సింలు, సమాఖ్య అధ్యక్షురాలు సునీత, అంగన్‌వాడీ టీచర్ రాచమ్మ, గ్రామస్తులు మహేందర్ పాల్గొన్నారు.